




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం జూన్ 05, 2026 | సంపుటి : 2 | సంచిక : 234 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## కొడంగల్ ఎత్తిపోతల ద్వారా
# లక్ష ఎకరాలకు సాగునీరు

### ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ పరిశీలన

» త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**నారాయణపేట,జూన్4 :**
మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. భీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. ªరాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను గురువారం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీదర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై
# రైతులకు అవగాహన

- వర్షాభావంపై సన్నద్ధం చేయండి
- వ్యవసాయాధికారులకు మంత్రి తుమ్మల సూచన



**హైదరాబాద్,జూన్4 :**
వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను కాల్చడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

మిగతాది 2లో

## రైతులు ఇబ్బందులను
# పట్టించుకోని సిఎం

♦ పర్యటనలతో ఒరిగేదేమీ లేదు: నిరంజన్ రెడ్డి



**వనపర్తి,జూన్4 :**
రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడ్డ సమయంలో కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టుల సందర్శన పేరుతో హడావుడి చేస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు.

మిగతాది 2లో

# తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దు

♦ ఆంధ్రా నాయకులకు గుత్తా కౌంటర్



**హైదరాబాద్,జూన్4 :**
తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దని తెలంగాణ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ నాయకులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతుంటే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభను నిర్వహిస్తామనడం సరైనది కాదని మీడియా చిట్‌చాట్‌లో పేర్కొన్నారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్




**ఆదిలాబాద్,జూన్4 :**
ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది . ఎయిర్ పోర్టుకు 1580 ఎకరాలు ఇవ్వడానికి సిద్దమైన రాష్ట్ర సర్కార్ ప్రతిపాదన లేఖను రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ మహంతికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అందించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లేఖ పట్ల సానుకూలత తెలిపింది కేంద్రం. రక్షణ శాఖ చెందిన 400 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే1580 ఎకరాలు కలిపి1980 ఎకరాల్లో ఎయిర్ ఫోర్స్ స్టేషన్, ఎయిర్ పోర్టు నిర్మాణానికి సానుకూలంగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది. కేంద్రం నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై సానుకూలంగా ఉన్న ప్రధాని మోడీ, సీఎం రేవంత్ కు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.



2లో..

## కార్మికులకు అండగా
# నిలిచేది బిఆర్ఎస్

- కార్మికుల సమస్యలపై సిఎంకు పట్టింపు లేదు
- జలమండలి గేట్ మీటింగ్‌లో తలసాని శ్రీనివాసయాదవ్

**హైదరాబాద్,జూన్4 :**
ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పోరాడేది గులాబీ జెండా మాత్రమేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై ప్రసంగించారు. వాటర్ బోర్డులో 50 సంవత్సరాల లో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం 650 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వాటర్ వర్క్స్ బోర్డు లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్న రాంబాబు యాదవ్‌ను 6 వ తేదీన జరిగే గుర్తింపు ఎన్నికలలో గెలిపించుకోవాలని తలసాని పిలుపునిచ్చారు. మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకున్నముఖ్యమంత్రి రెండున్నర సంవత్సరాలలో ఒక్కసారైనా సమీక్ష చేశారా? అని తలసాని ప్రశ్నించారు.

# ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి



- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి డిమాండ్

**జగిత్యాల,జూన్4 :**
రాష్ట్ర ప్రజానికంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆరోపించారు. వానకాలం పంట సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతున్నా గాని ప్రభుత్వానికి ముందస్తు కార్యచరణ ప్రణాళికను ఇంకా తయారు చేసుకోలేదని వెల్లడించారు.

2లో..

## అమీర్‌పేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో
# భారీ అగ్ని ప్రమాదం



**హైదరాబాద్:**
అమీర్‌పేటలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో గురువారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మెట్రో పిల్లర్ నెంబరు 1043 సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్ రెండో అంతస్తులో ఉన్న కేఎస్ఆర్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు చెలరేగాయి. క్రమంగా ఇతర దుకాణాలకూ వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది 3 ఫైరింజన్లు, 8 వాటర్ ట్యాంకర్లతో మంటలు అదుపు చేశారు. ఇతర దుకాణాల్లోని వారిని ఖాళీ చేయించారు. అమీర్‌పేటలోలోని ప్రధాన రహదారికి సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రమాదం జరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దట్టమైన పొగ అలముకోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో దుకాణాల్లో సిబ్బంది బయటకు పరుగులు తీయడంతో ప్రాణనష్టం తప్పింది. భారీగా ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో హెల్మెట్ షాపు ఉండటంతో ప్లాస్టిక్ సామగ్రి దగ్ధమై మంటల తీవ్రత ఎక్కువగా ఉందని అగ్నిమాపకశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి
# మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు

» సుప్రీంకోర్టు పలు కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ,జూన్4**
పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

2లో..



మిగతాది 2లో

## తెలంగాణ ఉద్యమకారులకు
# న్యాయం చేస్తాం

- ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం
- అఖిలపక్ష భేటీలో కమిటీ ఛైర్మన్ కేశవరావు

**హైదరాబాద్,జూన్4 :**
తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు.

## తెలంగాణ ఉద్యమకారులకు
# న్యాయం చేస్తాం

మొదటి పేజీ తరువాయి
విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ ప్రక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.

## ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి

మొదటి పేజీ తరువాయి
జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలకు సంబంధించి కార్యచరణను ఇంకా రూపొందించ లేదని ఆరోపించారు. కనీసం ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా మూడు సంవత్సరాల కాలంలో ఆరు పంటలు పండాయని, ఇందులో ఎన్ని పంటలకు రైతు భరోసా కల్పించారో ఆయన ఆత్మకే తెలుసని విమర్శించారు. ధాన్యం సేకరణపై కాంగ్రెస్ , బీజేపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రైతు గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. పప్పు దినుసులు, నూనె గింజలు పండించాలని సలహా ఇస్తున్న ప్రభుత్వం వాటికి ఏ విధమైన ప్రోత్సాహం కల్పిస్తుందో చెప్పడం లేదని పేర్కొన్నారు. కోతుల బెడద నుంచి పంటలను కాపాడేందుకు కోతుల పునరుత్పత్తి నిలుపుదల కేంద్రాన్ని జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని, తక్షణమే రైతుకు సోలార్ ఫెన్సింగ్ 50 శాతం రాయితీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో యూరియా అందుబాటులో లేదని, యూరియా యాప్‌ను తొలగించి నేరుగా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

మొదటి పేజీ తరువాయి
సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్‌టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

## కార్మికులకు అండగా నిలిచేది బిఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి
మీ సమస్యలపై ముఖ్యమంత్రికే పట్టింపు లేనప్పుడు ఆ పార్టీకి సంబంధించిన వ్యక్తిని గెలిపిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన చేతకాక ప్రశ్నించే వారిపై ఎదురుదాడి చేస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని తలసాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ ప్రభుత్వం అవగాహన, ప్రణాళిక లేకుండా మూడు కార్పొరేషన్లుగా విభజించి ఉద్యోగులు, ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని తలసాని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ రోజు కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా త్రాగునీటిని సరఫరా చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం త్రాగునీటిని కూడా సక్రమంగా ఇవ్వలేకపోతుందని మండిపడ్డారు. మీకు అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీ అని, మీ హక్కుల కోసం అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రకటించారు. మీ కోసం గొంతుక వినిపించే గులాబీ జెండాకు

మద్దతు తెలపాలని తలసాని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బోర్డులోని అనేక సమస్యలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అటు సూర్యుడు ఇటు పొడిచినా మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తలసాని హామీ ఇచ్చారు.

## రైతులు ఇబ్బందులను పట్టించుకోని సిఎం

మొదటి పేజీ తరువాయి
సీఎం గురువారం పాలమూరు పర్యటన సందర్భంగా పలు ప్రశ్నలు సంధించారు. విపత్తుల సమయంలో రాకుండా , రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న ఈ పర్యటనలు ఎవరికి ఉపయోగమని నిలదీశారు. సీఎం పర్యటనే వేళ తెలంగాణ వాదులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం సబబు కాదని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ వడ్లు కల్లాల్లోనే ఉన్నాయని,రైతు భరోసా అడుగుతారనే హెలికాప్టర్‌లో పర్యటిస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు ఆశలు కోల్పోయారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, భవిష్యత్తులో వారికి పరాభవం తప్పదని హెచ్చరించారు.

## తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దు

మొదటి పేజీ తరువాయి
మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ వాడిన భాష తీరు సరిగా లేదని వెల్లడించారు. అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అంటున్న సీఎం ,డిప్యూటీ సీఎం , మంత్రులు అమరావతిలోనే నివాసం ఉండాలని సూచించారు. తెలంగాణ కన్నా ఏపీలో ఎక్కువ సోర్స్ ఉన్నాయి. సముద్ర తీరం ఉంది. రకరకాల పోర్టులు ఉన్నాయి. ఆ నాయకులంతా ఏపీ అభివృద్ధి చూసుకోవాలి తప్ప తెలంగాణా వైపు చూడొద్దని హితవు పలికారు. తెలంగాణలో విద్వేషాలకు ప్రయత్నించవద్దని తెలిపారు. తెలంగాణ లో 75 శాతం ధాన్యం సేకరణ పూర్తి అయిందని, ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం సహకరించడం లేదని ఆరోపించారు. రైతులు పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని కోరారు. రైతులు వరి , పత్తి తప్ప ఏ పంటలు పండించడం లేదని వివరించారు.

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

మొదటి పేజీ తరువాయి
ఖాళీ స్థలాల్లో ఎలాంటేషన్ లేదా లీజు ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

## తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం కరీంనగర్,జనగామ, ములుగు జిల్లాలో మోస్తరు వానలు

తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు హుజూరాబాద్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో గాలి దుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ములుగు జిల్లా మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. కాలనీలకు కాలనీలు నీట మునిగిన పరిస్థితి ఉంది. సుభాష్ నగర్, ఆదర్శనగర్ కాలనీలు జలమయం కావడంతో ఇళ్లలోకి వరద నీరు చేరింది. స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ సహాయక చర్యలు చేపట్టారు. ప్రొ÷-లకెయినర్ల సహాయంతో డ్రైనేజీలు క్లీన్ చేయించి వరద నీరు వెళ్లేలా చర్యలు

తీసుకున్నారు. కరీంనగర్ నగరంలో కురిసిన భారీ వర్షానికి కట్టరాంపూర్ నాగన్న చౌరస్తా దగ్గర ఓ ఇంటి ప్రహరీ కూలింది. గోడతో పాటు పక్కనే ఉన్న భారీ వృక్షం కూడా నేలకొరిగింది. అటుగా నిలిపి ఉన్న కారుపై శిథిలాలు పడటంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. భారీ ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు పడుతున్న క్రమంలో.. పాత గోడలు, భారీ వృక్షాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షానికి పక్కనే ఉన్న డ్రైనేజీ పొంగి కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రాంగణం అంతా జలమయమైంది. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్?లో పిడుగు పడింది. మొబైల్?తో వర్షాన్ని రికార్డ్ చేస్తుండగా స్థానికుడు పిడుగుపాటుతో ఉలిక్కిపడ్డాడు.

## పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం
## విజయవాడ రహదారిపై ట్రాఫిక్ చిక్కులు

హయత్‌నగర్‌లో పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ లక్ష్మారెడ్డి పాలెం దగ్గర కారును ఢీకొట్టి పెట్రోల్ ట్యాంకర్ పల్టీ కొట్టింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చే రూట్‌లో ప్రమాదం జరగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సర్వీస్ రోడ్డులో వెహికల్స్?ను పోలీసులు పంపిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఫైర్ సిబ్బంది ఫోమ్ స్ప్రే చేస్తున్నారు. ఈ ఘటనలో రెండు కార్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కారులో ఉన్నవారికి గాయాలయ్యాయి. ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీక్ అవుతుండటంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. డ్రైవర్ పెట్రోల్ ట్యాంకర్‌లో ఇరుక్కుపోయాడు. జాతీయ రహదారి 65పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

## ఎపిలో పలు జిల్లాల్లో వర్షాలు
## నేడు కూడా వర్షాలు కురిసే అవకాశం

ఏపీలో గురువారం పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. సాయంత్రం ఐదు గంటల సమయానికి పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంటలో 30.5 మి.మీ., గుంటూరు జిల్లా తాడేపల్లిలో 27.2 మి.మీ., అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 18.5మి.మీ., విజయనగరం జిల్లా గుర్లలో 14.5 మి.మీ. వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దక్షిణ తెలంగాణ, దానిని ఆనుకొని ఉన్న కోస్తాంధ్ర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో శుక్రవారం పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, తదితర జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 44.7 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో 43.8, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 43.7, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 43.6, కృష్ణా జిల్లా కంకిపాడులో 43.4, ప్రకాశం జిల్లా కొండపిలో 43, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో, నెల్లూరు జిల్లా గూడూరులో 44 డిగ్రీలు, కృష్ణా జిల్లా పెదపారుపూడి, పల్నాడు జిల్లా అమరావతిలో 43.4, కంచికచర్లలో 43.2, గుంటూరు జిల్లా రాయపూడిలో 43, ప్రకాశం జిల్లా చీమకుర్తిలో 42.7, తిరుపతి జిల్లా బోనుప్పలెలో 42.4, విజయనగరం జిల్లా రాజాంలో 42.3, ఏలూరు జిల్లా కలపర్రులో 42.3, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం, ఏలూరు జిల్లా అల్లిపల్లి, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం, విజయనగరం జిల్లా దత్తిరాజేరులో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి‘ అని వెల్లడించింది.

## వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు
## ప్రజలకు అదనపు కలెక్టర్ సూచన

వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సారంగాపూర్ మండలంలోని సారంగాపూర్, బట్టపల్లి, పోతారం, నాయకపు గూడెం, బీర్పూర్ మండలంలోని బీర్పూర్, నర్సింహులపల్లి, తుంగూర్, కందేనకుంట గ్రామాల్లో అధికారులు ప్రత్యేక గ్రామసభలు గురువారం నిర్వహించారు. బీర్పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు గ్రామాల్లో వర్షాకాలంలో పారిశుద్య నిర్వహణపై ఆ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు, పారిశుద్య నిర్వహణ, ఎలినినో ప్రభావ పరిస్థితుల్లో రైతులు పంటల మార్పిడీ చేసుకోవడం, మ చర్యలు, గ్రామాల్లో ఇంకుడు గంతల నిర్మాణాల ఏర్పాటు, నీటిని పొదుపుగా వాడుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశాల్లో బీర్పూర్ మండల ప్రత్యేక అధికారి ప్రకాష్, తహసీల్దార్లు వహిదొద్దిన్, సుజాత, ఎంపీడీఓలు ఎండి సలీం, భీమేష్ ప్రజాప్రతినిధులు చేకూట ఆరుణ శేఖర్, మర్రిపెల్లి అశ్విని, పుష్పనాథ్, మల్యాల జ్యోతి, ఎలమట్ల హరీష్, ఎడ్ల సృజన సుశీన్, హర్షకోట రాజగోపాల్ రావు, కొమిరే నర్సయ్య, ఆయా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కేరళను తాకిని నైరుతి రుతుపవనం
## మరో వారం రోజుల్లో తెలంగాణకు రాక

ఇంతకాలం మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా చల్లని కబురు వచ్చేసింది. కేరళకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దాంతో కేరళ తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక అక్కడ ఇనుంచి తమిళనాడు, కర్నాటక,ఆంధ్రాలకు విస్తరిస్తాయి. మరో వారంలోపే ఈ రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు కొంత ఆలస్యంగా వచ్చాయి. వాస్తవానికి మే 26వ తేదీననే నైరుతి రుతపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసింది. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందుల య్యాయి. కాగా రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో అటు తమిళనాడులోని 15 జిల్లాల్లోనూ రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరిక జారీచేసింది. ఇదిలావుంటే.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో (జూన్-సెప్టెంబర్) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90శాతం వర్షమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్‌లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్‌లో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం
## నేడు విశాఖలో టిడిపి సైకిల్ రైడ్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహత్తర కార్యక్రమానికి టీడీపీ శ్రీకారం చుట్టనుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పేందుకు సైకిల్ యాత్ర చేపట్టనుందని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రేపు బాధ్యతగా సైకిల్ వినియోగించాలని అన్నారు. విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైకిల్ ప్రయాణం చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచం నేడు వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. ప్రజలు కూడా సైకిల్ యాత్రలో భాగస్వాములు కావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సైకిల్ వినియోగం వల్ల కాలుష్యం

తగ్గుతుందని, ఇంధన వినియోగం తగ్గుతుందని, ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పుకొచ్చారు. చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయన్నారు. 'నా దేశం నా బాధ్యతలో' భాగంగా ప్రతి ఒక్కరూ ఇంధన వినియోగం తగ్గించాలన్నారు. ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకునే ఈసారి మహానాడును హైబ్రిడ్ విధానంలో నిర్వహించి గ్రాండ్ సక్సెస్ సాధించామని తెలిపారు. ప్రజలందరూ సైకిల్ యాత్రలో భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు 'నేను సైతం' అంటూ ముందుకు రావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

## రేవంత్ పర్యటన..ముందుస్తు అరెస్టులు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం గద్వాల జిల్లాలో పర్యటన సందర్భంగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. గద్వాల నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు నాయుడును పోలీసులు అర్ధరాత్రి నుంచి హౌస్ అరెస్ట్ చేశారు. అదేవిధంగా పార్టీ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్ రాములు, కురువపల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్‌ను అరెస్టు చేయడం పట్ల హనుమంతు నాయుడు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో పోలీస్‌ల పహారాలు, నిర్బంధాలు ఎందుకని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం అంటూ బీరాలు పలుకుతూ ప్రతిపక్ష నాయకులపై అంక్షలు ఎందుకని నిలదీశారు. మూడు సంవత్సరాల పాలనకే ఇంత అభద్రతాభావమా.. ఇంతటి అరాచకమా? అని మండిపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రతిపక్ష పార్టీల సూచనలను, ప్రజల ఆలోచనలను పరిగణనలోకి తీసుకోకుండా హడావుడిగా ప్రాజెక్టుల సందర్శన చేపట్టడం విచారకరమని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండించారు.

## రెడేళ్ల కూటమి విజయాలపై ప్రజలకు వివరణ

**మంత్రులంతా ప్రజల్లోకి వెళ్లి చెప్పాలి**
**కేబినేట్ భేటీలో సిఎంచ్రబాబు సూచన**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా అందరూ ప్రజల్లోకి వెళ్లాలని మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. గురువారం సీఎం అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తమ శాఖలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. గత ప్రభుత్వం నిర్వాకాలపై శ్వేతపత్రాలు విడుదల చేశామని.. అప్పటి నుంచి ఈ రెండేళ్లలో ఏం చేశామో శాఖల వారీగా ఈనెల 28లోపు ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సీఎం చెప్పారు. దేశీయ, స్థానిక అవసరాల మేరకు పంటలు వేసే విధంగా రైతులను ఎడ్యుకేట్ చేయాలని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్ కమిటీ ఎందుకు వేయలేదంటూ ఉన్నతాధికారులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తున్నా ఎందుకిలా ఉన్నారని అధికారులపై సీరియస్ అయ్యారు. అగ్రిగోల్డ్ కేసులను వెంటనే పరిష్కరించేందుకు మొత్తం 31 కొత్త పోస్టులు మంజూరు చేసిన సీఎం.. వెంటనే కేబినెట్ సబ్ కమిటీని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎపీలో16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్ రాద్ధాంతం చేస్తున్నారని.. ప్రజలను అయోమయానికి గురిచేయాలని చూశారని మండిపడ్డారు. 'మనం గట్టిగా తిప్పికొట్టడంతో ఇప్పుడు తోక ముడిచారు. మనం చెప్పేది వివరంగా ప్రజలకు తెలియజేయాలి. అప్పుడు మాత్రమే ప్రజలకు తెలుస్తుంది' అని వివరించారు. ఇటీవల రాజధానిలో కొంతమంది రైతులను జగన్ కలిశారని సీఎం చెప్పగా.. జగన్ దగ్గరకు వెళ్లిన అశోక్ అనే రైతు నిన్న నేలపాడులో తన భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చారని మంత్రి నారాయణ తెలిపారు. రైతులను జగన్ గందరగోళంలోకి నెట్టాలని ప్రయత్నం చేస్తున్నారని.. కానీ రాజధాని రైతులు ఇప్పుడు కూడా జగన్ మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నారని సీఎం అన్నారు. జగన్ చెప్పిన మాటలను నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ప్రజలకు నిజాలు వివరిస్తే వాళ్లు పూర్తిగా అర్థం చేసుకుంటారన్నారు. అమరావతి, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నంలో యోగా డే నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

## నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు
## ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం: తలసాని

అగ్నిప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అమీర్ పేటలోని మైత్రివనం వద్ద అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. ప్రమాదం వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు, కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం జూన్ 05, 2026

# అరుణాచల గిరి ప్రదక్షిణలో

# జాగ్రత్తగా ఉండండి..భయపడకండి

**చీఫ్ బ్యూరో, కరపత్రం**

అరుణాచలేశ్వరుని దర్శనం అతి పవిత్రమైనది.పురాతన కాలం నుండి ఈ తీర్థ క్షేత్రం మహిమాన్వితమైనది.అరుణాచల మహత్యం హిందూ సనాతన ధర్మంలో అత్యంత ప్రాముఖ్యమైనది. స్వయంగా పరమశివుడే అగ్నిలింగ రూపంలో కొలువైన పవిత్ర క్షేత్రం ఇది. దీనిని స్మరించినంతనే ముక్తినిచ్చే క్షేత్రంగా (నినైత్తాలే ముక్తి తారుమ్) భక్తులు నమ్ముతారు.

**జ్యోతిర్లింగ స్వరూపం** సృష్టికర్త బ్రహ్మకు, విష్ణుమూర్తికి తమలో ఎవరు గొప్ప అనే వివాదం వచ్చినప్పుడు, శివుడు ఒక దివ్యమైన జ్యోతిర్లింగంగా (అగ్ని స్తంభం) అవతరించాడు. ఆ జ్యోతిర్లింగమే కాలక్రమేణా అరుణాచల పర్వతంగా మారింది.

**పంచభూత స్థలం**

ఈ క్షేత్రం పంచభూత స్థలాలలో అగ్ని తత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇక్కడ శివుడిని అరుణాచలేశ్వరుడు లేదా అణ్ణామలైయార్ అని పిలుస్తారు.

గిరి ప్రదక్షిణ మహిమ పర్వతం చుట్టూ సుమారు 14 కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ చేయడం అత్యంత పుణ్యప్రదంగా భావిస్తారు. ప్రదక్షిణ చేసే ప్రతి అడుగు సకల పాపాలను హరిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. స్వయంగా శివపార్వతులు కూడా ఈ గిరి ప్రదక్షిణ చేస్తారని విశ్వాసం.

**కార్తీక దీపం**

ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి నాడు కొండపై అఖండ జ్యోతిని (కార్తీక దీపం) వెలిగిస్తారు. ఈ దీప దర్శనం కోసం భక్తులు లక్షల సంఖ్యలో తరలివస్తారు.

**రమణ మహర్షి ఆశ్రమం**

శ్రీ రమణ మహర్షి తన జీవితాన్ని ఈ కొండ పాదాల వద్దనే గడిపారు. భగవాన్ రమణులు అరుణాచలాన్ని ఆధ్యాత్మిక జ్ఞానానికి కేంద్రంగా భావించి, దీనిని ఉద్ధరించారు.

ఇంతటి పవిత్ర పుణ్య క్షేత్ర దర్శనం తో జీవన సాఫల్యం జరుగుతుందని మన విశ్వాసం.

- **కానీ, ఈ మధ్యలో గిరి ప్రదక్షిణ చేసే ఒంటరి మహిళలపై, లేదా జంటగా వచ్చినప్పటికీ దుండగులు కొందరు అరాచకాలు అత్యాచారాలు చేస్తున్నారు**

**గిరి ప్రదక్షణలో రాత్రి తొమ్మిది గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు భక్తజన సంచారం తక్కువగా ఉన్న సమయంలో ఈ ఘటనలు జరుగుతున్నట్టుగా వార్తలు వెలుగులోకి వచ్చాయి**

**ఇవి నిజం కూడా**

కానీ, గిరి ప్రదక్షణకు వెళ్లకండి అంటూ కొందరు కొన్ని వీడియోలలో లేదా వార్తలలో ప్రచారం చేస్తున్నారు. ఇది సరైన సూచన కాదు.హిందువులు పిరికిగా ఆలోచించకూడదు. పిరికి భావనలు ప్రచారం చేయకూడదు. గిరి ప్రదక్షణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. రక్షణ కొరకు వెంట కర్రలు తీసుకెళ్లాలి.

భక్తుల సంఖ్య తగ్గిపోయిన రాత్రి సమయాల్లో తగిన జాగ్రత్తలతో గుంపుగా వెళ్లాలి.

**కానీ భయపడకూడదు**

హిందూ సనాతన ప్రతి దేవీ దేవతల చేతులలో ఆయుధం ఉంటుంది. అది స్వయం రక్షణకు సంకేతం.

- **ఇక వివరాల్లోకి వెళితే...**

తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరువణ్ణామలై (అరుణాచలం) గిరిప్రదక్షిణ మార్గంలో భక్తులపై దాడులు, అత్యాచారాలు జరిగిన మాట వాస్తవమేనని పోలీసు విచారణలో తేలింది.




మే 2026 చివరి వారంలో గిరిప్రదక్షిణ బాట సమీపంలోని అటవీ ప్రాంతాల్లో రెండు వేర్వేరు సామూహిక అత్యాచార (గ్యాంగ్ రేప్) ఘటనలు వెలుగుచూశాయి.

ఈ ఘోరాలపై స్పందించిన తమిళనాడు పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి, భక్తుల రక్షణ కోసం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

ఈ దారుణమైన ఘటనల పూర్తి వివరాలు మరియు పోలీసుల రక్షణ చర్యలు కింద ఘటనల వివరాలు.

మొదటి ఘటన (మే 30) ధర్మపురి జిల్లాకు చెందిన ఒక వివాహిత తన స్నేహితులతో కలిసి పౌర్ణమి గిరిప్రదక్షిణకు వచ్చారు. రాత్రి వేళ ప్రదక్షిణ ముగించుకుని బైక్‌పై తిరుగుప్రయాణమైన క్రమంలో, పెద్దకోలాపాడి వద్ద ఆమె తన స్నేహితుడితో మాట్లాడుతుండగా ఓ ముఠా మారణాయుధాలతో దాడి చేసింది. వారిద్దరినీ బలవంతంగా సమీపంలోని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి, వివాహితపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం వారిని నగ్నంగా వీడియోలు తీసి, రూ. 1 లక్ష ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది.

రెండో ఘటన (మే 31) తిరువణ్ణామలైకి చెందిన 23 ఏళ్ల యువతి గిరిప్రదక్షిణ చేస్తుండగా కాళ్లనొప్పులు రావడంతో అడిఅణ్ణామలై వద్ద ఆగింది. అక్కడ తన స్నేహితుడితో కలిసి అయ్యంపాలయం బైపాస్ రోడ్డు వద్ద కూర్చుని ఉండగా, అదే దుండగుల ముఠా వారిని బెదిరించి సమీప అటవీప్రాంతానికి తీసుకెళ్లి యువతిపై అత్యాచారానికి పాల్పడింది. బాధితులను నగ్నంగా వీడియోలు తీసి, ఆమె బంగారు కమ్మలను దోచుకెళ్లారు.

**పోలీసుల తక్షణ చర్యలు నిందితుల అరెస్ట్**

ఈ దారుణాలపై స్పందించిన తిరువణ్ణామలై పడమర పోలీసులు అత్యంత వేగంగా రంగంలోకి దిగారు.

నిందితులను పట్టుకునేందుకు 5 ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.

- **సాంకేతిక ఆధారాల సాయంతో ఈ ఘాతుకాలకు పాల్పడింది మొత్తం 11 మంది సభ్యుల ముఠాగా గుర్తించారు**

- **ప్రధాన నిందితుడు, హిస్టరీ షీటర్ అయిన వాసుదేవన్‌తో పాటు ఆకాష్, అప్పు, హరిహరన్, శర్మ, అరుణ్‌కుమార్, శివగణేశన్ మరియు ఒక 16 ఏళ్ల మైనర్ బాలుడితో కలిపి మొత్తం 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు.**

ప్రస్తుతం కోర్టు వీరికి రిమాండ్ విధించగా, పరారీలో ఉన్న మిగిలిన ముగ్గురు నిందితుల కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

ఈ ఘటనలపై తమిళనాడు ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉన్నతస్థాయి నివేదిక కోరారు.

భక్తుల, ముఖ్యంగా మహిళల రక్షణ కోసం ప్రభుత్వం మరియు తిరువణ్ణామలై జిల్లా పోలీసు యంత్రాంగం కింది రక్షణ చర్యలను చేపట్టారు

**అదనపు బలగాల మోహరింపు**

అరుణాచలం ఆలయ పరిసరాల్లోనూ, 14 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ బాటలోనూ యాత్రికుల రక్షణ కోసం అదనపు బలగాలతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

**పోలీస్ గస్తీ & నిఘా**

గిరి ప్రదక్షిణ మార్గంలో రాత్రి వేళల్లో పోలీసు రౌండ్-ది-క్లాక్ గస్తీని (పెట్రోలింగ్) పెంచారు. నేరాలను అరికట్టేందుకు సాదాసీదా దుస్తుల్లో ఉండే (ప్లైన్‌క్లోత్స్) ప్రత్యేక పోలీసు బృందాలను మోహరించారు.

**సీసీటీవీ కెమెరాల నిఘా**

గిరి ప్రదక్షిణ మార్గంలో మరియు అటవీ సరిహద్దుల వెంబడి మరిన్ని నిఘా కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని నేరుగా ఎస్పీ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు.

అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు భక్తులు గిరిప్రదక్షిణ సమయంలో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా అత్యవసర సహాయం కావాలన్నా సంప్రదించడానికి తిరువణ్ణామలై జిల్లా పోలీస్ శాఖ కింది నంబర్లను అందుబాటులో ఉంచింది:

- **పోలీస్ కంట్రోల్ రూమ్: 100 / 91596 16263**

**ఏఎస్పీ ఆఫీస్: 94981 00431**
**టౌన్ క్రైమ్ పోలీస్ స్టేషన్: 04175-222303**
**వాట్సాప్ హెల్ప్‌లైన్: 9363622330**

పోలీసుల సూచనలు గిరిప్రదక్షిణ చేసే భక్తులు ఒంటరిగా కాకుండా సమూహాలుగా వెళ్లాలని, రాత్రి వేళల్లో ప్రధాన మార్గాన్ని వదిలి నిర్జన ప్రదేశాలు లేదా సమీపంలోని అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకూడదని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మమత పార్టీకి మరో షాక్
## బిధ్నానగర్ మేయర్ కృష్ణాచక్రవర్తి రాజీనామా

పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. బిధాన్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కృష్ణా చక్రవర్తి.. గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారామె. రాజీనామా అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. 16 ఏళ్లుగా నేనీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ఎవరి పట్లా నాకే అసంతృప్తి లేదు. నిబంధనల ప్రకారమే రాజీనామా చేశా. నాకు నేను కొంత సమయం కేటాయించాలి అనుకుంటున్నాను. కౌన్సిలర్‌గా కొనసాగుతూ ప్రజలకు సేవ చేయదలచుకున్నాను' అని చెప్పారు. టీఎంసీ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీకి సన్నిహితురాలిగా ఉన్న కృష్ణా చక్రవర్తి తన రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. స్థానిక కార్పొరేషన్ అధికారులూ ఆమె రాజీనామా లేఖ అందిన విషయాన్ని ధ్రువీకరించారు. అలాగే రాష్ట్ర పురపాలక వ్యవహారాల శాఖ మంత్రి, అదనపు ప్రధాన కార్యదర్శికి కూడా లేఖ ప్రతులను పంపినట్లు అధికారులు తెలిపారు. ఆమె రాజీనామా ఆమోద ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతుందని స్పష్టం చేశారు. కాగా.. తృణమూల్ కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కృష్ణా చక్రవర్తి నిర్ణయం బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. టీఎంసీకి సుదీర్ఘకాలంగా సేవలందించిన నేతగా, మమతకు అత్యంత సన్నిహితురాలిగా ఆమెకు పేరుండటంతో ఈ రాజీనామా ప్రాధాన్యం సంతరించుకుంది.

## పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం
## విజయవాడ రహదారిపై ట్రాఫిక్ చిక్కులు

హయత్‌నగర్‌లో పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ లక్ష్మారెడ్డి పాలెం దగ్గర కారును ఢీకొట్టి పెట్రోల్ ట్యాంకర్ పల్టీ కొట్టింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చే రూట్‌లో ప్రమాదం జరగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సర్వీస్ రోడ్డులో వెహికల్స్?ను పోలీసులు పంపిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఫైర్ సిబ్బంది ఫోమ్ స్ప్రే చేస్తున్నారు. ఈ ఘటనలో రెండు కార్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కారులో ఉన్నవారికి గాయాలయ్యాయి. ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీక్ అవుతుండటంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. డ్రైవర్ పెట్రోల్ ట్యాంకర్‌లో ఇరుక్కుపోయాడు. జాతీయ రహదారి 65పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

## ఎపిలో పలు జిల్లాల్లో వర్షాలు
## నేడు కూడా వర్షాలు కురిసే అవకాశం

ఏపీలో గురువారం పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. సాయంత్రం ఐదు గంటల సమయానికి పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంటలో 30.5 మి.మీ., గుంటూరు జిల్లా తాడేపల్లిలో 27.2 మి.మీ., అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 18.5మి.మీ., విజయనగరం జిల్లా గుర్లలో 14.5 మి.మీ. వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దక్షిణ తెలంగాణ, దానిని ఆనుకొని ఉన్న కోస్తాంధ్ర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో శుక్రవారం పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, తదితర జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 44.7 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో 43.8, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 43.7, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 43.6, కృష్ణా జిల్లా కంకిపాడులో 43.4, ప్రకాశం జిల్లా కొండపిలో 43, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో, నెల్లూరు జిల్లా గూడూరులో 44 డిగ్రీలు, కృష్ణా జిల్లా పెదపారుపూడి, పల్నాడు జిల్లా అమరావతిలో 43.4, కంచికచర్లలో 43.2, గుంటూరు జిల్లా రాయపూడిలో 43, ప్రకాశం జిల్లా చీమకుర్తిలో 42.7, తిరుపతి జిల్లా బోనుప్లలెలో 42.4, విజయనగరం జిల్లా రాజాంలో 42.3, ఏలూరు జిల్లా కలపర్రులో 42.3, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం, ఏలూరు జిల్లా అల్లిపల్లి, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం, విజయనగరం జిల్లా దత్తిరాజేరులో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి' అని వెల్లడించింది.

# టిఆర్ఎస్ జెండా పండుగ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు..

» టిఆర్ఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఇన్చార్జి డాక్టర్ లయన్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూ 4**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. జూన్ 2న వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఘనంగా నిర్వహించిన టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమాల విజయవంతానికి సహకరించిన పార్టీ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తెలంగాణ ప్రజలందరికీ టీఆర్ఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఇన్‌చార్జి డాక్టర్ లయన్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ స్వాభిమాన పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన, రైతు సంక్షేమం, యువత భవిష్యత్ అభివృద్ధే టీఆర్ఎస్ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. రైతు



కష్టానికి తగిన గౌరవం, ఆదాయం లభించే విధంగా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత ప్రకటించిన "పాంచజన్యం" అజెండాను అమలు చేస్తామని తెలిపారు. ఇందులో ఉచిత, నాణ్యమైన విద్య, అందరికీ అందుబాటులో వైద్యం, రైతే రాజు అనే సంక్షేమ విధానాలు, యువతకు ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం ఆధారంగా సమాన అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరవీరులు చేసిన త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఒక సమగ్ర, సమానత్వ తెలంగాణ నిర్మాణం కోసం టీఆర్ఎస్ ఉద్యమిస్తోందన్నారు. "సామాజిక తెలంగాణ" సాధనే తమ అంతిమ లక్ష్యమని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పార్టీ కార్యాచరణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో టీఆర్ఎస్ సిద్ధాంతాలు, పాంచజన్యం అజెండాను ఇంటింటికీ తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు.

# సాగర్‌లో టీఆర్ఎస్ జెండా గద్దె కూల్చివేతపై ఉద్రిక్తత

- మున్సిపల్ కార్యాలయం ముందు టీఆర్ఎస్ నాయకుల ధర్నా

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 4**

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నందికొండ మున్సిపాలిటీ లో టీఆర్ఎస్ జెండా గద్దె కూల్చివేత వివాదానికి దారితీసింది. సాగర్ పైలాన్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ జెండా గద్దెను మున్సిపల్ అధికారులు తొలగించడం పై పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర రాజకీయ పార్టీల జెండా గద్దెలు యథాతథంగా ఉండగా, టీఆర్ఎస్ గద్దెను మాత్రమే లక్ష్యంగా చేసుకుని కూల్చివేశారని ఆరోపిస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, మున్సిపల్ అధికారుల తీరును ఖండించారు. ప్రజాస్వామ్య విలువలను పక్కనపెట్టి రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

ఒక్క టీఆర్ఎస్ గద్దెనే ఎందుకు? ఈ సందర్భంగా టీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, పైలాన్ క్రాస్ రోడ్డు వద్ద అన్ని పార్టీల జెండా గద్దెలు ఉన్నప్పటికీ ఒక్క టీఆర్ఎస్ గద్దెను





మాత్రమే కూల్చివేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. గత నెల 20వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ఎక్కడా సమస్యలు తలెత్తకపోయినా నందికొండలో మాత్రమే ఇలాంటి చర్యలు చేపట్టడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి మేరకే మున్సిపల్ అధికారులు వ్యవహరించారని ఆరోపిస్తూ, టీఆర్ఎస్ పార్టీ పట్ల అధికార యంత్రాంగం వివక్ష చూపుతోందని విమర్శించారు. పోలీసులతో వాగ్వాదం

నిరసన కార్యక్రమం సందర్భంగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ధర్నా చేస్తున్న నాయకులను శాంతింపజేసేందుకు పోలీసులు ప్రయత్నించగా, ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే అనుచరుల ప్రమేయంతోనే ఈ ఘటన జరిగిందని టీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

మళ్లీ అదే చోట గద్దె నిర్మిస్తాం

ఈ సందర్భంగా నల్గొండ జిల్లా టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ విక్రాంత్ రెడ్డి, నాగార్జునసాగర్ ఇన్‌చార్జ్ బాలు నాయక్, అబ్జర్వర్ బోడుపల్లి లింగం, దేవరకొండ ఇన్‌చార్జ్ శివ నాయక్, డి. సరిత, బొల్లంపల్లి సందీప్ తదితరులు మాట్లాడుతూ.. పార్టీ జెండా గద్దెను కూల్చివేసిన అదే ప్రాంతంలో తిరిగి నిర్మిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజలే సరైన తీర్పు ఇస్తారని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్ళు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం జూన్ 05, 2026

# కరీంనగర్ -- జగిత్యాల జాతీయ రహదారికి రూ.2500 కోట్ల వరం

- ఉమ్మడి జిల్లా ప్రజల దశాబ్దాల కల సాకారం
- అభివృద్ధే నా ఎజెండా -- ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా : కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్, జూన్ 4:**
తెలంగాణలో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కరీంనగర్ -- జగిత్యాల జాతీయ రహదారి (ఎన్‌హెచ్--563) విస్తరణ ప్రాజెక్టుకు సుమారు రూ.2500 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.
ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లా ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కరీంనగర్--జగిత్యాల నాలుగు లైన్ల రహదారి కలను కేంద్ర ప్రభుత్వం నిజం చేసిందన్నారు.
ఇది కేవలం ఒక రహదారి ప్రాజెక్టు మాత్రమే కాకుండా ఉత్తర తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసే చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.
బండి సంజయ్ ప్రత్యేక చొరవతోనే ప్రాజెక్టు ఆమోదం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిరంతరం కృషి చేస్తున్నారని ఆకుల రాజేందర్ తెలిపారు. ఆయన ప్రత్యేక చొరవ, పట్టుదల, కేంద్ర ప్రభుత్వంపై చేసిన ఒత్తిడి కారణంగానే ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించిందన్నారు.
కరీంనగర్ నుండి జగిత్యాల వరకు సుమారు 58.8 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ ఫోర్‌లేన్ జాతీయ రహదారి ప్రాంతీయ అభివృద్ధికి నాంది పలుకుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడి ప్రజల ప్రయాణం సురక్షితంగా, సౌకర్యవంతంగా మారుతుందని పేర్కొన్నారు.

**▪ రోడ్డు ప్రమాదాల నివారణకు కీలకం**

ప్రస్తుతం కరీంనగర్ -- కొండగట్టు -- జగిత్యాల మార్గంలో భారీ ట్రాఫిక్ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఫోర్‌లేన్ రహదారి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు ప్రమాదాల సంఖ్య కూడా తగ్గే అవకాశం ఉందన్నారు. అత్యవసర సేవలు, వాణిజ్య రవాణా, ప్రజా రవాణా వ్యవస్థలకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని చెప్పారు.

**▪ పరిశ్రమలు -- వ్యాపారాలకు కొత్త ఊపు**

కరీంనగర్ -- జగిత్యాల జాతీయ రహదారి నాగ్‌పూర్ కారిడార్‌తో అనుసంధానం కావడం వల్ల ఇతర రాష్ట్రాలకు రవాణా మరింత సులభతరం అవుతుందని ఆకుల రాజేందర్ వివరించారు. దీనివల్ల కొత్త పరిశ్రమలు, గిడ్డంగులు, లాజిస్టిక్ కేంద్రాలు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు.
వ్యాపార రంగానికి కొత్త అవకాశాలు అందుబాటులోకి రావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా కూడా వేగవంతం అవుతుందని తెలిపారు. తద్వారా ఉత్తర తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలక మలుపు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
మోదీ -- గడ్కరీ -- బండి సంజయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు
ఇంతటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌లకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజల తరపున ఆకుల రాజేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**▪ అభివృద్ధే మా లక్ష్యం**

కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల సంక్షేమం మౌలిక సదుపాయాల విస్తరణే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా కృషి కొనసాగుతుందని, "అభివృద్ధే మా ఎజెండా -- ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం" అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.

# బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు-సర్పంచ్ కుమారస్వామి




**కరపత్రం ప్రతినిధి భీమదేవరపల్లి;**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రం లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆ గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి హెచ్చరించారు. గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. అమ్మకానికి నిలువ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపులు నిర్వహించ వద్దంటూ అమ్మకం దారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శనిగరపు ఐలయ్య, వార్డు సభ్యులు ప్రేమలత, లలిత, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## దాసరపు కాంతమ్మ దశదినకర్మలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 4**
జమ్మికుంట పట్టణ పరిధిలోని 28వ వార్డుకు చెందిన దాసరపు వాసు తల్లి దాసరపు కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె దశదినకర్మ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ హాజరై దాసరపు కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం దివంగత కాంతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, దివంగత ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరమైన విషయమని పేర్కొంటూ, వారి కుటుంబానికి తనవంతు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



దాసరపు కాంతమ్మ జీవితంలో కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ పలువురు ఆమెకు నివాళు లర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దిడ్డి రాము, గడ్డం దీక్షిత్, నదీం తదితరులు పాల్గొని దివంగతురాలికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. స్థానిక ప్రజలు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరై దాసరపు కాంతమ్మకు తమ చివరి నివాళులు అర్పించారు.

# కరీంనగర్ గ్లోబల్ సిటీగా మారే దిశగా అడుగులు వేస్తుంది.ఇది తెలంగాణకే గర్వకారణం.

- కరీంనగర్ బహుత్ తేజీ సే ఏక్ గ్లోబల్ సిటీ బన్నే కీ ఓర్ బఢ్ రహా హై.యే తెలంగాణ కా గౌరవ్ హై.
- స్మార్ట్ సిటీ కా మతలబ్ సిర్ఫ్ టెక్నాలజీ నహీం, బల్కి లోగోం కీ జిందగీ కో ఆసాన్ బనానా హై.
- ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశంలో పూర్తి హిందీ ప్రసంగంతో ఆకట్టుకున్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జూన్ 4**
కరీంనగర్ బహుత్ తేజీ సే ఏక్ గ్లోబల్ సిటీ బన్నే కీ ఓర్ బఢ్ రహా హై.యే తెలంగాణ కా గౌరవ్ హై. కరీంనగర్ చాలా వేగంగా ఒక గ్లోబల్ సిటీగా మారే దిశగా అడుగులు వేస్తోంది. ఇది తెలంగాణ కే గర్వకారణం అని నగర మేయర్ కొలగని శ్రీనివాస్ అన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం ఋషి కేష్ లో జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117 వ సమావేశంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పై వ్యాఖ్యలు చేశారు. జూన్ 3 , నాలుగు తేదీల్లో ఋషికేష్ జరిగిన ఆల్ ఇండియా మేయర్స్ సమావేశాల్లో పాల్గొన్న కోలగాని శ్రీనివాస్ ముందుగా సమావేశంలో పాల్గొన్న ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి , రాష్ట్ర మంత్రులు , ఎంపీలు , సహచర మేయర్లు , అధికారులందరికీ నమస్కారాలు తెలియజేసి కరీంనగర్ స్మార్ట్ సిటీ , అర్బన్ డెవలప్మెంట్ గురించి హిందీలో తన ప్రసంగాన్ని కొనసాగించి అందర్నీ ఆకట్టుకున్నారు. ముఖ్యంగా స్మార్ట్ సిటీ కా మతలబ్ సిర్ఫ్ టెక్నాలజీ నహీం, బల్కి లోగోం కీ జిందగీ కో ఆసాన్ బనానా హై.స్మార్ట్ సిటీ అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదు, ప్రజల జీవితాలను సులభతరం చేయడం.అని అన్నారు. కరీంనగర్, తెలంగాణలోని ఒక ముఖ్యమైన ,వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, దీనిని కేంద్ర ప్రభుత్వ 'స్మార్ట్ సిటీ మిషన్' కింద ఎంపిక చేశారన్నారు.
కరీంనగర్‌ను ఒక ఆధునిక నగరంగా మార్చడానికి అనేక పెద్ద మార్పులుజరుగుతున్నాయన్నారు నగరంలో స్మార్ట్ రోడ్లు, మంచి ఫుట్‌పాత్‌లు , డ్రైనేజీలు , నగరం మొత్తంలో సీసీటీవీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భద్రతను పెంచడానికి అనేక కార్యక్రమాలుజరుగుతున్నాయన్నారు. ప్రధానంగా కరీంనగర్‌లో స్వచ్ఛమైన నీరు, మంచి డ్రైనేజీ వ్యవస్థ , మెరుగైన రోడ్లు, అందమైన పార్కులను నిర్మించి ప్రజలకు ఒక మెరుగైన వాతావరణాన్ని అందించే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. అంత్ మే ఓర్ ఏక్ బాత్ గర్వ్ సే కహనా చాహేతూ ఇస్ మొకే పర్... "తెలంగాణ రాజ్య కే గఠన్ కే బాద్ పహలీ బార్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పర్ బిజెపి నే కబ్జా కియా ఔర్ మేయర్ కీ కుర్సీ హాసిల్ కీ. యహ్ తెలంగాణ బిజెపి కే లియే ఏక్ ఐతిహాసిక్ జీత్ జైసీ హై. చివరగా ఓ విషయాన్ని ఈ సందర్భంగా గర్వముగా చెప్పదలుచుకున్నా. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావనంతరం ప్రప్రదమంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను బిజెపి కైవసం చేసుకుంది..ఇది తెలంగాణలో నే బీజేపీకి ఒక చారిత్రక విజయం లాంటిది. అని ధన్యవాద్.జైహింద్.భారత్ మాతాకీ జై. అని మేయర్ కోలగని శ్రీనివాస్ తన ప్రసంగాన్ని ఈ సందర్భంగా ముగించారు. గురువారం ముగింపు సమావేశానికి ఉత్తరాఖండ్ మంత్రివర్యులుమదన్ కౌశిక్ జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మదన్ కౌశిక్ జి మేయర్ కొలగని శ్రీనివాస్ ను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

# 5, 6, 7 తేదీల్లో హైటెక్స్ లో చేనేత వస్త్ర ప్రదర్శన

అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన పోచంపల్లి 'ఇక్కత్' వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఈనెల 5,6,7 తేదీల్లో ప్రత్యేక వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు.
పోచంపల్లి చేనేత కళాకారుల జీవన ప్రమాణాల మెరుగుపరిచే లక్ష్యంతో జూన్ 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్ హైటెక్స్ లో 'త్రెడ్ పోచంపల్లి' పేరిట వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచేందుకు ఏర్పాటు చేసే ఈ ఎగ్జిబిషన్ లో దాదాపు 100 పైగా స్టాల్స్, మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

# రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవా అవార్డు గ్రహీతలకు సన్మానం.

- రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవా అవార్డు గ్రహీత హుజురాబాద్ టౌన్ సీఐ కరుణాకర్ కు సన్మానం.
- కానిస్టేబుల్ హెచ్ సి.మల్లయ్య, ఇటీవల బదిలీ పై వచ్చిన ఏఎస్ఐ బి.సంపత్.
- బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షులు సందేల వెంకన్న,







**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, జూన్ 04,**
రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవ అవార్డు గ్రహీతలు హుజురాబాద్ టౌన్ సిఐ టీ. కరుణాకర్, కానిస్టేబుల్ హెచ్ సి.మల్లయ్య, ఇటీవల బదిలీ పై వచ్చిన ఏఎస్ఐ బి.సంపత్ లను టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలోహుజురాబాద్ బీసీ జేఏసీ అధ్యక్షులు సందేల వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినారు. ఈ సందర్భంగా హుజురాబాద్ బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, బీసీ ముద్దు బిడ్డ టీ.కరుణాకర్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవ పోలీసు అవార్డును అందుకోవడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తూ హుజురాబాద్ కీర్తి పతాకాన్ని రాష్ట్రస్థాయిలో రెపరెపలాడించిన వారి సేవలను కొనియాడినారు. ముఖ్యంగా సమాజంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు సముచితమైనటు వంటి న్యాయముజరుగునట్లు చూడవలసిన గురుతరమైన టువంటి బాధ్యత వారిపై ఉందని ఈ సందర్భంగా గుర్తుచేసినారు. అదేవిధంగా తమ విధిని చట్ట ప్రకారము నిర్వర్తించి అన్ని వర్గాల ప్రజల ఆధారాభిమానాన్ని చూరగొనే విధంగా ఇంకా రెట్టింపు సేవలను సమాజములోని అన్ని వర్గాల ప్రజలకుఅందించి జాతీయస్థాయిలో ఒక ఉత్తమ పోలీస్ ఆఫీసర్గా ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించినారు. ఈ సన్మాన కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శిఇప్పకాయల సాగర్, శాలపల్లి ఇందిరానగర్ సర్పంచ్ కోడిగుడి ప్రవీణ్, హుజురాబాద్ మండలకాంగ్రెస్ అధ్యక్షురాలు పుల్లా రాధా, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు రామ్ సారయ్య, తునికి సమ్మయ్య, ప్రతాప నాగరాజు, మంచి కట్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలు నియమించిన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్

జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలను ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నియమించారు. జనసైనికుల నుంచే భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దే వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని అధినేత చెప్పుకొచ్చారు. 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా కసరత్తు చేస్తున్నామని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. కేడర్ ఆధారిత నాయకత్వ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయి సమాచారాన్ని పరిశీలించి పార్టీ బాధ్యతల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకుంటామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో మరో విషాదం
## ఒకే కుటుంబానికి చెందిన 8మంది దుర్మరణం

దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో గల ఫ్లోరిష్ స్టే రెస్టారెంట్‌లో బుధవారం ఉదయం జరిగిన ఘోర అగ్ని ప్రమాదం ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతిచెందడం తీవ్ర విషాదాన్ని నింపింది.గురుగ్రామ్‌లోని సెక్టార్ 46కు చెందిన వివేక్ అగర్వాల్ అనే చార్టర్డ్ అకౌంటెంట్.. మ్యాక్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తండ్రిని పరామర్శించేందుకు ఢిల్లీ వెళ్లారు. ఆయనతో పాటు తల్లి ప్రేమ్ లత, భార్య తర్జనీ అగర్వాల్, ఇద్దరు కుమార్తెలు జివిషా, వారియా, మరో ముగ్గురు బంధువులూ ఉన్నారు. వీరంతా బస చేసేందుకు.. ప్రమాదానికి గురైన ఫ్లోరిష్ స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్‌లో 2 గదులను బుక్ చేసుకున్నారు. వీరు అల్పాహారం తీసుకుంటుండగా ఒక్కసారిగా ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మొత్తం 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ కుటుంబంలో ప్రాణాలతో మిగిలిన ఏకైక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివేక్ అగర్వాల్ తండ్రి రాధేశ్యామ్ అగర్వాల్(80) మాత్రమే. ఒకే కుటుంబంలోని 8 మంది మరణించడంతో గురుగ్రామ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా.. డీఎన్‌ఏ టెస్టుల అనంతరం బంధువులకు మృతదేహాలను అప్పగిస్తామని అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8:30 గంటలకు ఆ రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇరుకైన భవనం కావడంతో వేగంగా మంటలు వ్యాపించాయి. ఎంట్రీ, ఎగ్జిట్ ఒకేచోట ఉండటంతో అందులో ఉన్నవారు తప్పించుకునేందుకు వీలులేకుండా పోయింది. ప్రమాద సమయంలో అందులో సుమారు 40 మంది ఉన్నట్టు సమాచారం.

## ట్రెక్కింగ్‌కు వెళ్లిన యువతి అదృశ్యం స్నేహితులను అరెస్ట్ చేసి విచారణ

స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయింది. 6 రోజులు గడుస్తున్నా ఆమె ఆచూకీ దొరకలేదు. పోలీసులు ఆమె స్నేహితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని నైనితాల్‌కు చెందిన బబితా పాండే అనే యువతి ఎంబీఏ చేస్తోంది. వారం రోజుల క్రితం ఆమె తన స్నేహితులు హర్మన్‌పాల్ సింగ్, హర్మన్ ప్రీత్ సింగ్‌లతో కలిసి టూర్‌కు వెళ్లింది. మే 25వ తేదీన వారు హర్సిల్, గంగోత్రితో పాటు చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రదేశాల్లో తిరిగారు. ముగ్గురూ మే 28వ తేదీన రైతాల్ గ్రామానికి వెళ్లారు. ఆ రోజు అక్కడే ఉన్నారు. మరుసటి రోజు రైతాల్ నుంచి దయారా బుగ్యాల్‌కు ట్రెక్కింగ్ మొదలెట్టారు. ఆ రాత్రి గోయ్ బేస్ క్యాంప్‌లో బస చేశారు. అర్ధరాత్రి నుంచి బబిత కనిపించకుండాపోయింది.